మోడీ, అమిత్ షాది ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం

- అందుకే వారు పేదల ఓట్లు తీసేస్తున్నారు
- రాహుల్, ఖర్గేలకు అండగా నిలబడదాం
- రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం
- ఓట్ చోరీపై ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధాని మోడీ, కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాలది ఆర్‌ఎస్‌ఎస్ భావజాలమని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి విమర్శించారు. అందుకే వారు దేశంలోని పేదలు, ముస్లింల ఓట్లు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారనీ, అందులో భాగంగానే సర్ అనే పేరుతో కొత్త సర్వే తీసుకొస్తున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి కుట్రలకు వ్యతిరేకంగా తమ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ పోరాడుతున్నారని తెలిపారు. వారికి అండగా నిలబడటం ద్వారా దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని సిఎం పిలుపునిచ్చారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో 'ఓట్ చోర్-గద్దీ ఛోడ్' పేరితో ఆదివారం న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు. తెలంగాణ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఈ ధర్నాలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాజ్యాంగ రచన సమయంలో మహాత్మా గాంధీ, అంబేద్కర్ రాజ్యాంగ సభలో దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, పేదలకు ఓటు హక్కు విషయమై చర్చించారని గుర్తు చేశారు. ఆ సందర్భంలో ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త ఎం.ఎస్.గోల్వాల్కర్ తదితరులు వారికి ఓటు హక్కు ఇవ్వొద్దన్నారని గుర్తుచేశారు. గాంధీ, అంబేడ్కర్ ఆ వ్యాఖ్యలను తోసిపుచ్చి దేశంలోని పౌరులందరికీ ఓటు హక్కు కల్పించారని కొనియాడారు. ఈ క్రమంలోనే దళితులు, గిరిజనులు, మైనారిటీలందరూ కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వాములవుతున్నారని వివరించారు.



ఆర్‌ఎస్‌ఎస్, గోల్వాల్కర్ భావజాలాన్ని అమలు చేసేందుకు నరేంద్ర మోడీ, అమిత్ షా 400 సీట్లలో గెలిపించాలని కోరారని తెలిపారు. ఈ నేపథ్యంలో బిజెపికి 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తారనీ, రిజర్వేషన్లు ఎత్తివేస్తారని రాహుల్ గాంధీ చేసిన ప్రచారంతో దేశ ప్రజలు అప్రమత్తమై ఆ పార్టీని 240 సీట్లకు పరిమితం చేశారని వివరించారు. బిజెపి అధికారాన్ని పరిమితం చేయడంతో దేశంలో రాజ్యాంగం, రిజర్వేషన్లు పరిరక్షింపబడ్డాయని తెలిపారు. దీంతో ఖంగుతిన్న బీజేపీ నేతలు ఇప్పుడు ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపునకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాడు పేదలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల కోసం గాంధీ, అంబేడ్కర్ నిలబడినట్టే ఇప్పుడు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే వారి కోసం నిలబడుతున్నారు.. కలబడుతున్నారని కొనియాడారు. దేశ ప్రజలు వారికి అండగా నిలవాలని, రాహుల్ గాంధీ సిపాయిగా మారి మోడీకి వ్యతిరేకంగా పోరాడాలని సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ పేరుతో తొలుత ఓటరు కార్డు తొలగిస్తారు.. తర్వాత ఆధార్, రేషన్ కార్డ్ రద్దు చేస్తారని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఆ తర్వాత ప్రజలకున్న హక్కులన్నీ గుంజుకుంటారని తెలిపారు. ఈ సమస్య ఎన్నికలదో.. కాంగ్రెస్ పార్టీదో కాదనీ, ఇది యావత్ దేశ సమస్యని వివరించారు. మోడీ, షా కుట్రలకు వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ చేసే పోరాటంలో కలిసి సాగేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని రేవంత్ రెడ్డి తెలిపారు.



ప్రచారం చేస్తున్న జాన్‌వెస్లీ

సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

- ఎర్రజెండాతోనే సమస్యల పరిష్కారం
- పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రజా సమస్యలపై ప్రశ్నించే సిపిఎం సర్పంచ్ అభ్యర్థులను ఎన్నికల్లో గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. ఎర్రజెండాతోనే గ్రామాల్లో సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా యాచారం, మంచాల మండలాల్లో జాన్‌వెస్లీ పర్యటించి, పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహించారు. యాచారం మండల పరిధిలోని చిన్నతుండ్లలో పార్టీ సర్పంచ్ అభ్యర్థి సామర్ది జగన్‌ను గెలిపించాలని ర్యాలీ నిర్వహించారు. వాలీబాల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో పార్టీ అభ్యర్థి సపావత్ లలిత పాండు బ్యాట్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడారు. గతంలో దున్నేవాడికి భూమి కావాలని, వెట్టి చాకిరి నశించాలని, పేదలకు బంజారు భూములు పంచాలని, కూలి రేట్లు పెంచాలని సిపిఎం నాయకత్వంలో అనేక పోరాటాలు జరిగాయని అన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండి, ప్రజా సమస్యలపై పోరాడేది ఎర్రజెండా మాత్రమే ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పనిచేసిన మస్కు నరసింహ కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.సామెల్, జిల్లా కమిటీ సభ్యులు కర్నాటి శ్రీనివాస్‌రెడ్డి, మంచాల మండల కార్యదర్శి వర్గ సభ్యులు మార బుగ్గ రాములు, సీనియర్ లాయర్ అరుణ్‌కుమార్, పార్టీ యాచారం మండల కమిటీ సభ్యుడు ఎం.జె వినోద్ కుమార్, పార్టీ శాఖ కార్యదర్శులు మహేందర్, భగత్, నాయకులు విజయ్ కుమార్, మాజీ సర్పంచులు ఆకుల భిక్షపతి, మస్కు పద్మజా, మస్కు అరుణమ్మ పాల్గొన్నారు.

19న బిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిసెంబర్ 19న బిఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ అధినేత కెసిఆర్ హాజరు కానున్న ఈ సమావేశంలో కృష్ణా, గోదావరి జలాల విషయంలో పదేళ్ల బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులను నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకు పోవడంలో చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరి మీద చర్చించనున్నారు. ఎగువ, దిగువ రాష్ట్రాలతో నీటి వాటాల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై సమావేశంలో చర్చించి తగు నిర్ణయం తీసుకోనున్నారు. రైతుల సాగునీటి హక్కులను కాపాడుకోవడానికి ప్రజల్లోకి వెళ్లేందుకు ఈ సమావేశంలో కార్యాచరణను రూపొందించనున్నారు.

కుమారుడిపై తండ్రి ఘన విజయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సర్పంచి ఎన్నికలో కుమారుడిపై తండ్రి ఘన విజయం సాధించారు. మెదక్ జిల్లా రామాయంపేట ఝాన్సీలింగాపూర్ పంచాయతీ ఎన్నికల్లో తండ్రి మానెగల్ల రామకిష్టయ్య.. ఆయన కుమారుడు వెంకటేశ్ పోటీపడ్డారు. నువ్వా నేనా అన్నట్లుగా ప్రచారం నిర్వహించారు. ఓటర్లు మాత్రం తండ్రి రామకిష్టయ్య వైపు మొగ్గు చూపి 99 ఓట్ల మెజారిటీతో విజయాన్ని అందించారు. గ్రామంలో మొత్తం 1,985 ఓట్లు ఉండగా తండ్రికి 684 ఓట్లు, కుమారుడికి 585 ఓట్లు పోలయ్యాయి. రామకిష్టయ్య మూడో సారి సర్పంచిగా గెలుపొందటం విశేషం.

విశ్వనగరమంటే ఇదేనా?

- వరసగా వృద్ధుల హత్యలు
- బస్తీల్లో పెరిగిన డ్రగ్స్ వాడకం
- ఆడపిల్లలపై ఆగని ఆగడాలు : కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'హైదరాబాద్‌లోని కొన్ని చోట్ల తాగునీటిలో మురికి నీరు కలుస్తోంది. మరి కొన్ని చోట్ల తాగునీరు పెట్రోల్ వాసన వస్తోంది. ప్రతి నిత్యం నగరంలో ఏదో ఒక చోట వృద్ధుల హత్యలు జరుగుతున్నాయి. బస్తీల్లో ఖాళీలు స్థలాలను చెత్త డంపింగ్ కు యధేచ్ఛగా ఉపయోగించుకుంటున్నారు. అక్కడే డ్రగ్స్, గంజాయి వాడకం ఎక్కువగా ఉంటోంది. ఆ దారుల్లో వెళ్లే ఆడపిల్లలపై నిత్యం ఆగడాలు జరుగుతున్నాయి. మరోవైపు వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వాటి స్టెరిలైజ్ కోసం కేటాయించిన నిధులను సరిగా వినియోగించుకోకపోవడంతో రెండేళ్లలో కుక్కకాటు కేసులు 31 శాతం పెరిగాయి. ఆర్‌టిసి బస్సులను సగానికి తగ్గించారు. సామాన్యులకు ప్రజా రవాణా అందుబాటులో లేకుండా చేశారు. వికలాంగులైతే ఆర్టీసీ బస్సులు ఎక్కే పరిస్థితే లేదు. ఇలాంటి నగరం విశ్వనగరం అవుతుందా? …. ' అని తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు.

హైదరాబాద్‌లో ఐదు రోజుల పాటు ఆమె చేపట్టిన జనం బాట ఆదివారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. జీహెచ్‌ఎంసీలో 27 మున్సిపాల్టీలను విలీనం చేసిన తర్వాత ఒక కోటి మందికి పైగా జనాభా పెరిగారని తెలిపారు. అంతకుముందు 7,700 ఆర్టీసీ బస్సులుంటే వాటిని 3,500కు తగ్గించారని తెలిపారు. ప్రజా రవాణా లేకపోవడంతో 80 లక్షల ప్రయివేటు వాహనాలను అనివార్యంగా ప్రజలు వినియోగించే పరిస్థితికి ప్రభుత్వమే కారణమమని ఆమె విమర్శించారు. 2022లో నగరంలోలో కుక్కకాటుకు సంబంధించి 92,924 నమోదైతే 2024 నాటికి 1,23,997 (31 శాతం) అధికంగా నమోదయినట్టు చెప్పారు. లంగర్‌హౌజ్ బాపూఘాట్‌ను డ్రగ్స్, గంజాయి తీసుకునే అసాంఘిక శక్తులు ఉపయోగించుంటున్నా నియంత్రణ చర్యలు లేవని తప్పుపట్టారు. యాకుత్‌పురా నియోజకవర్గంలో తాగునీటిలో మురికి నీరు కలిసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అడిక్‌మెట్‌లో వస్తున్న తాగునీరు పెట్రోల్ వాసన వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సనత్‌నగర్ దాసరి బస్తీలో గంజాయి బ్యాచ్ రెచ్చిపోతుందని ఆందోళన వ్యక్తం చేటశారు. ఆడపిల్లలను వేధిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్‌లో కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంను పిల్లలు ఆడుకునేందుకు ఇవ్వకుండా వ్యాపార అవసరాల కోసం ప్రయివేటు వ్యక్తుల కార్యక్రమాలకు ఇస్తున్నారని కవిత ఆరోపించారు.

రాష్ట్రానికి నిధులివ్వని కేంద్రం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెలంగాణకు అదనంగా నిధులు, ఇవ్వాల్సిన వాటాను కూడా పెండింగ్‌లో పెడుతున్నదని కవిత విమర్శించారు. హైదరాబాద్ లాంటి నగరాలకు అదనంగా నిధులివ్వాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని గుర్తుచేశారు. 2019-20 నుంచి 2024-25 వరకు తెలంగాణ నుంచి రూ.4,35,919 కోట్లను పన్నుల రూపేణా వసూలు చేసిన కేంద్రం వాటిలో కేవలం రూ.3,76,715 కోట్లు మాత్రమే ఇచ్చిందని చెప్పారు. రూ.59,200 కోట్లను పెండింగ్‌లో పెట్టిందని విమర్శించారు.

సింగరేణి డబ్బులతో ఫుట్‌బాల్ ఆడుతారా?

సీఎం రేవంత్ రెడ్డి ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడడం వల్ల ఎవరికి ప్రయోజనం? అని కవిత ప్రశ్నించారు. ప్రజలకు ఉపయోగపడని ఆ ఆట కోసం జీవోను మార్చి సింగరేణి నిధులను రూ. పది కోట్లను మళ్లించారని ఆమె ఆరోపించారు. ఆ నిధులను తిరిగి సింగరేణికి ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ఏ ప్రాతిపదికన జిహెచ్‌ఎంసిలో 27 మున్సిపాల్టీలను విలీనం చేశారని ఆమె ప్రశ్నించారు.

ఆ విగ్రహం పెట్టొద్దు

రవీంద్రభారతిలో ఎస్.పి.బాలసుబ్రమణ్యం విగ్రహాన్ని ఏర్పాటు చేయటాన్ని కవిత తప్పుపట్టారు. ఆ విగ్రహాన్ని పెట్టొద్దని ప్రభుత్వానికి సూచించారు. విగ్రహ ఏర్పాటుకు వ్యతిరేకిస్తున్న తెలంగాణవాదుల పక్షాన్నే తాను నిలబడతానని స్పష్టం చేశారు. రవీంద్రభారతిలో తెలంగాణ కళాకారుల విగ్రహాలను ప్రతిష్టించాలని కోరారు. సినీ పరిశ్రమకు చెందిన బాల సుబ్రమణ్యం విగ్రహం ఏర్పాటుకు వేరే స్థలాన్ని ఎంపిక చేసుకోవాలని ఆమె సూచించారు.

గ్రామీణ మార్పునకు సంకేతం

- రెండో విడత ఫలితాలపై మహేశ్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంచాయతీ ఎన్నికల రెండో విడత ఫలితాలు రాష్ట్రంలోని గ్రామీణ రాజకీయాల్లో స్పష్టమైన మార్పుకు సంకేతంగా నిలిచాయని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అభిప్రాయపడ్డారు. ఆదివారం న్యూఢిల్లీలో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారులే ఘన విజయం సాధించడం, గ్రామీణ ఓటర్లు ప్రభుత్వ పాలనపై వ్యక్తం చేసిన విశ్వాసానికి ప్రతిబింబంగా నిలిచిందని ఆయన అభివర్ణించారు. పంచాయతీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఆయన తెలిపారు. మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులను ఒకే వేదికపై సమన్వయం చేస్తూ గ్రామ స్థాయి వరకు వ్యూహాత్మకంగా ప్రచారం చేయడం ఈ విజయానికి ప్రధాన కారణమని ఆయన స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండు సంవత్సరాలుగా అమలవుతున్న ప్రజాపాలన, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు నేరుగా ప్రజలకు అందుతున్న తీరు ఈ ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపించిందని ఆయన చెప్పారు. గ్రామస్థాయి సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు అనుకూలంగా మారిందని మహేష్ గౌడ్ విశ్లేషించారు. సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ తీసుకుంటున్న నిర్ణయాలు గ్రామీణ ఓటర్లలో కాంగ్రెస్‌పై విశ్వాసాన్ని మరింత పెంచాయని చెప్పారు. ప్రజలను నేరుగా కలిసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే పద్ధతి పార్టీ బలాన్ని పటిష్టం చేస్తోందని పేర్కొన్నారు. "సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి" అనే నినాదానికి ప్రజలు పట్టం కట్టారని, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఘన విజయం దీనికి స్పష్టమైన ప్రతీక అని మహేష్ గౌడ్ అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో సామాజిక న్యాయం స్పష్టంగా ప్రతిఫలించిందని కూడా పేర్కొన్నారు.



బంజారాహిల్స్‌లో ఎఐఎస్ హెూమియోపతి క్లినిక్ ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ : నగరంలోని బంజారాహిల్స్‌లో ఎఐఎస్ ప్రత్యేక హెూమియోపతి క్లినిక్‌ను ఏర్పాటు చేసింది. ఆదివారం దీనిని భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి సుదర్శన్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ క్లినిక్ నిర్వాహకులు డాక్టర్లు విపున్, చంద్రకాంత్, విశాల్ మాట్లాడుతూ.. సంప్రదాయ హెూమియోపతి సూత్రాలను ఆధునిక క్లినికల్ మూల్యాంకనం, నైతిక వైద్య పద్ధతులు, రోగి అవగాహనతో సమన్వయం చేస్తూ ఈ క్లినిక్‌ను రూపొందించామని పేర్కొన్నారు. భద్రమైన, శస్త్రచికిత్సల అవసరం లేని చికిత్సలతో పాటు దీర్ఘకాలిక ఆరోగ్యం, వ్యాధి నివారణ, జీవన నాణ్యత మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు.

నాటి నాయకత్వ కృషి మరువలేనిది

- మహిళా సంఘం నిర్మాణంలో వారిది ఎనలేని ప్రాత
- ఐద్వా హైదరాబాద్ నాయకత్వ ఆత్మీయ సమ్మేళనంలో పుణ్యవతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"మహిళా సంఘం నిర్మాణం చేసే సమయంలో అక్కడ ఒకరు… ఇక్కడ ఒకరు అన్నట్టుగా ఉండేవారు. అలాంటి సందర్భంలోని అలుపెరగకుండా సంఘం నిర్మించడానికి నాటి నాయకత్వం చేసిన కృషి మరువలేనిది. ఉదయం ఉద్యోగాలు చేసుకుంటూ సాయంత్రం మహిళా సంఘాన్ని నిర్మించారు. అవసరమైనప్పుడు ఉద్యోగాలకు సెలవులు పెట్టారు…" అని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి కొనియాడారు. ఐద్వా 14వ జాతీయ మహాసభల నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని గోల్కొండ చౌరస్తాలో ఉన్న ఐద్వా నగర కార్యాలయంలో సంఘం హైదరాబాద్ నగర ఉద్యమ నిర్మాతల నుంచి నేటి వరకు బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకత్వ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పుణ్యవతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళలు సాధించుకున్న హక్కులను, సౌకర్యాలను కాలరాసే విధంగా విధానాలను తీసుకొస్తున్నదని విమర్శించారు. ఆ విధానాలకు, మహిళలపై హింసకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో నాటి నాయకత్వం వీలైనంత మేరకు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వయస్సు, ఆరోగ్యం రీత్యా, కుటుంబ బాధ్యతల రీత్యా అప్పటిలా చురుగ్గా పాల్గొనలేకపోతున్నామని బాధపడే కంటే చేయగలిగిన పద్ధతిలో భాగస్వాములు కావాలని కోరారు. మరోసారి పాత జ్ఞాపకాలను, ఉద్యమ నిర్మాణ ఘట్టాలను గుర్తు చేసుకుంటూ కలుసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 1970లో హైదరాబాద్ నగర కమిటీ కార్యదర్శిగా సుగుణమ్మ, సక్కుబాయి, సుజావతి, వర్ధిని కమిటీ సభ్యులుగా ఏర్పడినప్పటి నుంచి అనేక ఒడిదుడుకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. అన్నింటిని ఎదుర్కోవడంతో హైదరాబాద్ (ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్) పరిధిలో ఉద్యమ నిర్మాణం జరిగిందని చెప్పారు. ఇప్పటికీ తమ శక్తి మేరకు పని చేస్తామని వెల్లడించారు.

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ జాతీయ మహాసభల సందర్భంగా వివిధ రకాల ఎగ్జిబిషన్లు, సెమినార్లు, ఏర్పాట్ల కోసం వేయనున్న కమిటీల్లో అందరూ భాగస్వాములై మహాసభలను జయప్రదం చేద్దామని కోరారు. ఈ సమావేశానికి ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణ జ్యోతి, ఉపాధ్యక్షులు టి జ్యోతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె నాగలక్ష్మి, రాష్ట్ర నాయకులు ఎం వినోద, పి శశికళ, వై వరలక్ష్మి ఎం లక్ష్మమ్మ, ఎండి షబానా బేగం, సృజన, హైదరాబాద్ సెంట్రల్, సౌత్, మేడ్చల్ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

అందెశ్రీని ప్రపంచానికి పరిచయం చేసింది సమాచార శాఖనే

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

ప్రజాకవి అందెశ్రీ ని ప్రపంచానికి పరిచయం చేసింది సమాచార శాఖనే అని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, సామాచార, పౌర సంబంధాల శాఖ పూర్వ స్పెషల్ కమిషనర్ ఫణికుమార్ తెలిపారు. సమాచార, పౌర సంబంధాల శాఖ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విశ్రాంత ఉద్యోగుల వార్షిక ఆత్మీయ సమ్మేళనం ఆదివారంనాడిక్కడి ఖైరతాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశమందిరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఆయనతోపాటు రిటైర్డ్ డైరెక్టర్లు కిస్మత్‌కుమార్, సుభాష్‌గౌడ్, సత్యారావు, శ్రీనివాస్, ప్రమోద్‌రావు సహా విశ్రాంత అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫణికుమార్ మాట్లాడుతూ 2001లో జరిగిన మహిళా జన్మభూమి కార్యక్రమానికి తమ శాఖాపరమైన ఆహ్వానంపై అందెశ్రీ ఎన్నో ఉత్తేజకరమైన పాటలు రాసారనీ, ఆ పాటల్లో తెలంగాణకు వ్యతిరేకంగా, కించపరుస్తూ రాయబోనని అప్పట్లోనే స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు. ఆ పాటలతోనే అందెశ్రీని సమాచారశాఖ ప్రపంచానికి పరిచయం చేసిందని వివరించారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో సమాచార, పౌర సంబందాల శాఖ ఎంతో విశిష్టమైనదని, ఎంతటి క్లిష్టమైన ఈవెంట్లనైనా అతితక్కువ వ్యయంతో కష్టపడి, స్వచ్ఛందంగా పనిచేసి విజయవంతం చేసే అధికారులు, సిబ్బంది ఉన్నారని ప్రసంసించారు. ఇతర ఏశాఖలో ఉత్పన్నం వచ్చినా అది మనదే అని ఫీల్ అవడం సమాచార శాఖకే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి సహా వివిఐపిలతో నేరుగా ప్రత్యక్షంగా పనిచేసే శాఖ కూడా ఇదేనని చెప్పారు. ఇంటలిజెన్స్‌తో సమానంగా సమాచార శాఖ పనిచేస్తుందన్నారు. అయితే పిఆర్‌ఒ విధుల నిర్వర్తించడం ఆషామాషీ శాఖ కాదని, ఎంత చేసినా అద్భుతంగా చేశారని ఎవరూ మెచ్చుకోరని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో 75 ఏండ్లు పూర్తి చేసుకున్న రిటైర్డ్ అధికారులు, ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. లీగల్ అంశాలపై ప్రసంగం, యోగా, ఆరోగ్య విషయాలపై ప్రత్యేక క్లాసులు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

రికార్డు స్థాయిలో 'సిఎంఆర్‌ఎఫ్' సాయం

- రెండేళ్లలో 3.76 లక్షల మంది లబ్ధిదారులు
- పేద, మధ్యతరగతి ప్రజలకు రూ.1,685 కోట్ల నిధులు
- కాంగ్రెస్ పాలనలో మెరుగైన వైద్యం పొందుతున్న బాధితులు
- బిఆర్‌ఎస్ హయాంలో ఏడాదికి సగటున రూ.450 కోట్లు ఖర్చు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి సహాయనిధి (సిఎంఆర్‌ఎఫ్) సాయం రికార్డు స్థాయిలో అందింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఎక్కువ మంది ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఈ రెండేళ్ల కాలంలో 3,76,373 మంది లబ్ధిదారులు రూ.1,685.79 కోట్ల నిధులను పొందారు. ఇందులో లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఒసి) ద్వారా 27,421 మందికి రూ.533.69 కోట్ల ఆర్థిక సాయం అందింది. రీయింబర్స్‌మెంట్ కింద 2,48,952 మంది లబ్ధిదారులు రూ.1,152.10 కోట్లు పొందారు. పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సహాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అందించింది. మునుపెన్నడూ లేనివిధంగా ఈ సేవలను విస్తరించింది. 2014 నుంచి 2024 వరకు పదేండ్ల కాలంలో బీఆర్‌ఎస్ హయాంలో సగటున ఏడాదికి రూ.450 కోట్లు సిఎంఆర్‌ఎఫ్ నిధులను ఖర్చు చేసింది. కాంగ్రెస్ పాలనలో ఈ రెండేండ్లలోనే రూ.1,685 కోట్లు ఆర్థిక సాయం చేసింది. అంటే ఏడాదికి సగటున రూ.850 కోట్లు అందించింది. అంటే బీఆర్‌ఎస్ కంటే కాంగ్రెస్ ప్రభుత్వం రెట్టింపు స్థాయిలో సాయం అందించడం గమనార్హం. ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి నాయత్వంలో పేదలు, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ఈ ప్రభుత్వం అండగా నిలిచింది.

రెండు పద్ధతుల ద్వారా సిఎంఆర్‌ఎఫ్

సిఎంఆర్‌ఎఫ్ సాయాన్ని రెండు పద్ధతుల ద్వారా పొందడానికి అవకాశమున్నది. ఎల్‌వోసీ ద్వారా లబ్ధిదారుడు నిర్దిష్ట ప్రభుత్వ ఆస్పత్రుల్లో (నిమ్స్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి, ప్రభుత్వ ఈఎన్‌టీ) చికిత్స కోసం చెల్లింపునకు హామీ ఇచ్చే అధికారిక లేఖను పొందొచ్చు. ఈ లేఖలో చూపిన ఆర్థిక సాయం రోగి ఎలాంటి డబ్బు చెల్లించాల్సిన అవసరం లేకుండా చికిత్స పొందడానికి అవకాశమున్నది. రీయింబర్స్‌మెంట్ ద్వారా వ్యక్తి ఏదైనా ఆస్పత్రి (ప్రభుత్వ, ప్రయివేటు, కార్పొరేట్)లో చికిత్స పొంది బిల్లులు చెల్లించిన తర్వాత ఖర్చు చేసిన మొత్తంలో కొంత భాగాన్ని తిరిగి చెల్లించాల్సిందిగా సిఎంఆర్‌ఎఫ్‌నకు దరఖాస్తు చేసుకోవడానికి వీలున్నది. ప్రభుత్వం ఆ దరఖాస్తులను పరిశీలించి ఆమోదించిన మొత్తానికి చెక్కును లబ్ధిదారులకు జారీ చేస్తుంది.

ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి

ఎల్‌వోసీ ప్రత్యేక చికిత్స అందించే ప్రభుత్వ సంస్థలకు మంజూరు చేస్తుంది. దీంతో ప్రజలు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన వైద్యాన్ని పొందగలుగుతున్నారు. దీనికోసం ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. నిజాం ఆస్పత్రిలో 26,694 మంది, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో 316 మంది, ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రిలో 196 మందికి ఎల్‌వోసీలను ప్రభుత్వం ఇచ్చింది. వినికిడి సమస్యలున్న పిల్లల కోసం శస్త్ర చికిత్సలు, పరికరాల అమరికతో సహా ఆర్థిక సాయం చేసింది.

దళారుల ప్రమేయాన్ని తగ్గించిన ప్రభుత్వం

సిఎంఆర్‌ఎఫ్ పొందడానికి దళారుల ప్రమేయాన్ని ప్రభుత్వం తగ్గించింది. పారదర్శకతను పెంచింది. అందుకోసం దరఖాస్తు ప్రక్రియను ఆన్‌లైన్‌లోకి మార్చింది. ఎలాంటి మోసాలకు తావులేకుండా ఆధార్ పరిశీలన జరిపి చెక్కుల మీద లబ్ధిదారుని పేరుతోపాటు బ్యాంక్ అకౌంట్ నెంబర్‌ను ముద్రించడం జరుగుతున్నది. దీనివల్ల అవకతవలకు అవకాశం లేదు.

తెలంగాణ వారికే సాయం

సిఎంఆర్‌ఎఫ్ పొందాలంటే దరఖాస్తు దారుడు తప్పనిసరిగా తెలంగాణ నివాసి అయి ఉండాలి. స్థానికులకే సిఎంఆర్‌ఎఫ్ సాయం అందుతుంది. వార్షిక కుటుంబ ఆదాయం రూ.1.60 లక్షలకు మించొద్దు. తెల్లరేషన్ కార్డు కలిగిన వారే అర్హులు.

దరఖాస్తు ప్రక్రియ విధానం

దరఖాస్తులు ఇప్పుడు ప్రధానంగా అధికారిక తెలంగాణ సిఎంఆర్‌ఎఫ్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో స్వీకరించబడుతున్నాయి. ప్రజాప్రతినిధి కార్యాలయం సిఎంఆర్‌ఎఫ్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ఫారాన్ని పూరించాల్సి ఉంటుంది. వాటితోపాటు ఆధార్‌కార్డు, తెల్లరేషన్‌కార్డు, ఆదాయ ధృవీకరణపత్రం, మొబైల్‌నెంబర్, ఆస్పత్రి అంచనా లేదా అసలు బిల్లులు, డిశ్చార్జ్ సమ్మరీ, బ్యాంక్ పాస్‌బుక్ మొదటిపేజీని జతచేయాలి. స్థానిక ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ లేదా ఎంపీ నుంచి సిఫారసు లేఖ తప్పనిసరిగా ఉండాలి. ఈ నిధుల పంపిణీ రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద పౌరులకు అందించే చికిత్సలు అదనంగా ఉంటాయి. మరింత సమాచారం కోసం దరఖాస్తుదారులు సచివాలయంలోని సిఎంఆర్‌ఎఫ్ కార్యాలయాన్ని లేదా 040-23455662 నెంబర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది

రెండేళ్లలో 3.76 లక్షల మంది లబ్ధిదారులు
రికార్డుస్థాయిలో 'సిఎంఆర్‌ఎఫ్' సాయం

సిఎంఆర్‌ఎఫ్ వివరాలు

కాలమానం	నిధులు	లబ్ధిదారులు
లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ)	రూ.533.69 కోట్లు	27,421
రీయింబర్స్‌మెంట్ కేసులు	రూ.1,152.10 కోట్లు	3,48,952
పంపిణీ చేసిన సాయం	రూ.1,685.79 కోట్లు	3,76,373

సీనియర్ అధికారుల ఆదేశాల మేరకే ట్యాపింగ్

- మూడోరోజు సిట్ ముందు ప్రభాకర్‌రావు వాంగ్మూలం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన సీనియర్ల ఆదేశం మేరకే ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం నడిచిందని ఎస్ఐబి మాజీ ఐజీ ప్రభాకర్‌రావుసిట్‌అధికారుల ముందు వాంగ్మూలం ఇచ్చినట్టు తెలిసింది. ఆదివారం మూడోరోజు సిట్ అధికారులు ప్రభాకర్‌రావును జూబ్లీహిల్స్‌లోని ఎసిపి కార్యాలయంలో ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్‌రావును తమ కస్టడీలోనే ఉంచుకొని సిట్ అధికారులు ప్రశ్నిస్తున్న విషయం విదితమే. ఏడు రోజుల పాటు కస్టడీకి సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.గత ప్రభుత్వ హయాంలో సాగిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారాన్ని నిగ్గు తేల్చడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్న సిట్ అధికారులు.. ఎస్ఐబీ మాజీ చీఫ్ నుంచి నిజాలనురాబట్టడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే తాము ప్రశ్నించిన నలుగురు పోలీసు అధికారుల నుంచి రాబట్టిన సమాచారంతో పాటు తమ ఫోన్లు ట్యాపింగ్ చేశారని తెలిపిన అనేక మంది బాధితుల నుంచి సేకరించిన సమాచారాన్ని కూడా సిట్ అధికారులు క్రోడీకరించుకొని ప్రశ్నలను రూపొందించుకున్నారు. ఈ నేపథ్యంలో ఫోన్‌ట్యాపింగ్ చేసే సమయంలో తాము ఎవరెవరి ఫోన్లను తప్పనిసరిగా ట్యాపింగ్ చేయాల్సి ఉందో సీనియర్ అధికారులతో కూడిన స్క్రీనింగ్ కమిటీకి పంపించాల్సి ఉంటుంది. వారిచ్చిన గ్రీన్ సిగ్నల్ మేరకే ట్యాపింగ్ వ్యవహారాన్ని ఎస్ఐబి అధికారులు ముందుకు నడిపించడం జరుగుతుంది. అయితే బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో నడిచిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారమంతా రాజకీయ ప్రేరేపణతోనే జరిగిందనీ, అప్పటి ప్రభుత్వంలో ఉన్న కీలక నేతల ఆదేశాల మేరకే ప్రభాకర్‌రావు ఫోన్‌ట్యాపింగ్‌లను సాగించారని సిట్ ఇప్పటి వరకు సేకరించిన సమాచారాన్ని బట్టి అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలో మూడో రోజు ప్రశ్నలలో ఈ ఫోన్‌ట్యాపింగ్‌ను సాగించడానికి వెనుక ఎవరి హస్తమున్నదనేది తేల్చడానికి సిట్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఆ సమయంలో ఉన్న తన సీనియర్ అధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్‌లు చేశామనీ, అది కూడా చట్ట వ్యతిరేకుల పైనే ఎక్కువగా దృష్టిని సారించామని ప్రభాకర్‌రావు సమాధానాలిచ్చినట్టు సమాచారం. ఈ సందర్భంగా కొందరు రాజకీయ ప్రముఖుల ఫోన్లను ఎందుకు ట్యాపింగ్ చేశారనే విషయంలో మాజీ ఐజీ నుంచి నేరుగా సమాధానాలు రాలేదని తెలిసింది. మరికొన్ని ప్రశ్నలకు పొంతన లేని సమాధానాలు కూడా ఆయన ఇచ్చినట్టు సమాచారం. కాగా సుప్రీంకోర్టు ఆదేశాలనుసారం ప్రభాకర్‌రావుకు ఆయన నివాసం నుంచే భోజనంతో పాటు ఆయనకు అవసరమైన ట్యాబ్లెట్లు తెప్పించి ఆయనకు ఇస్తున్నారు.


ప్రశాంతంగా ముగిసిన ఎపిపి పరీక్ష

రాష్ట్రంలో ఆదివారం అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉద్యోగాల కోసం అభ్యర్థులు రాసిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యాన ఈ పరీక్ష జరిగింది. 118 ఎపిపి పోస్టుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా రెండు వేల మందికి పైగా అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారని అధికారులు తెలిపారు.

ఐటి ఉద్యోగుల సంక్షేమానికి సమగ్ర చట్టం తేవాలి

- వారి పని గంటలు, ఉద్యోగ భద్రతపై హైకోర్టు వ్యాఖ్యలు హర్షణీయం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు పని వేళలు, ఉద్యోగ భద్రతకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఐటీ ఉద్యోగుల సంక్షేమానికి సమగ్ర చట్టం చేయాలని హైకోర్టు చేసిన వ్యాఖ్యల పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేరుకు వైట్‌కాలర్ ఉద్యోగులైనప్పటికీ విపరీత పనిగంటలు, మానసిక ఒత్తిళ్లతో ఐటీ ఉద్యోగులు నలిగిపోతున్నారనీ, చిన్న వయస్సులోనే దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఉద్యోగాలకు రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఐటి సంస్థల యాజమాన్యాలు ఎప్పుడు పడితే అప్పుడు ఉద్యోగాలు తీసేయడం, రాజీనామా చేస్తే డబ్బులు చెల్లించాలనే అగ్రిమెంట్లు రాయించుకోవడం పట్ల జస్టిస్ నగేష్ భీమపాక ధర్మాసనం చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఫుడ్‌పాయిజన్ ఘటనలు

- వాటిని అరికట్టేందుకు విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలి
- ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం, హాస్టళ్ల ప్రిన్సిపళ్ల నిర్లక్ష వైఖరితోనే ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. వాటిని అరికట్టేందుకు విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలనీ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి మైనారిటీ గురుకుల బాలికల హాస్టల్‌కు చెందిన 26 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న విషయం విదితమే. వారంతా కింగ్‌కోఠి, నిలోఫర్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ఆదివారం కింగ్ కోఠి ఆస్పత్రిలో ఎస్‌ఎఫ్ఐ నాయకులతో కలిసి విద్యార్థునులను జాన్‌వెస్లీ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్ల వద్ద వాకబు చేశారు. విద్యార్థునులను, వారి తల్లిదండ్రులను ఘటనకు సంబంధించిన పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సిపిఎం హైదరాబాద్ సెంట్రల్‌సిటీ కార్యదర్శి ఎం.వెంకటేశ్, ముషీరాబాద్ జోన్ ఇన్‌చార్జి ఆర్.వెంకటేశ్, ఎస్‌ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు అచ్చిన లెనిన్, అశోక్‌రెడ్డి, తదితరులున్నారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ..నవంబర్ 12న పులిసిన పెరుగు, కుళ్ళిన కూరగాయల ఆహారం తినటంతోనే విద్యార్థునులు అస్వస్థతకు గురయ్యారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ ఘటన బయటకు రాకుండా ప్రిన్సిపల్ ప్రయత్నించడం ప్రభుత్వ నిర్లక్ష వైఖరిని తెలియజేస్తోందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్టళ్లల్లో ముక్కిపోయిన బియ్యం, నాసిరకం పప్పులు, కుళ్లిపోయిన కూరగాయలు, ఫ్రిజ్‌లో పెట్టిన పులిసిపోయిన పెరుగును నాలుగైదు రోజులు వాడటం, తాగునీటి కలుషితం, వంటి వాటి వల్లనే తరుచూ ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఎత్తిచూపారు.

జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, మాదాపూర్ ప్రైమరీ స్కూళ్లల్లో అస్వస్థతకు గురైన ఘటనలు మరవకముందే బాగ్‌లింగంపల్లి ఘటన జరగడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోందని తెలిపారు. హాస్టళ్ళ నిర్వహణా లోపం, పర్యవేక్షణ కొరవడటం, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం సరిగాదన్నారు. బాగ్‌లింగంపల్లి ఘటనపై మానవహక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించినప్పటికీ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ హాస్టళ్లకు చెల్లించాల్సిన బిల్లులను పూర్తిగా చెల్లించాలనీ, ఘటనలకు కారణమవుతున్న అధికారులపై, కాంట్రాక్టు సంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పర్యవేక్షణా లోపాలను సరిదిద్ది, ఆహార భద్రత ప్రోటోకాల్‌ను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఆహారం వండటానికి సర్టిఫైడ్, శిక్షణ పొందిన కుక్‌లను మాత్రమే నియమించే విషయంపై తక్షణమే కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు.



బాధిత విద్యార్థులను పరామర్శిస్తున్న జాన్‌వెస్లీ

ఓటమి భయంతోనే కాంగ్రెస్ దాడులు

- మేము తిరగబడితే తట్టుకోలేరు
- ఉప్పల మల్లయ్య కుటుంబానికి అండగా బిఆర్ఎస్ :కెటిఆర్
- మృతుని కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థికసాయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సర్పంచ్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే కాంగ్రెస్‌నేతలు తమ పార్టీ నేతలపై దాడులకు, దౌర్జన్యాలకు తెగబడుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ మండిపడ్డారు. 'మేము తిరగబడితే రాష్ట్రం ఆగమైతది.. పదేండ్లు మేము అధికారంలో ఉన్నాం.. ఏనాడూ మీలాగా ఆలోచించలేదు. తాము కూడా మీలాగే ఆలోచించి ఉంటే ఈ రోజు కాంగ్రెస్ కార్యకర్తలకు ఈ పరిస్థితి ఉండేదా?" అని హెచ్చరించారు. రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవని, కాంగ్రెస్ నేతలు ఇప్పటికైనా దిక్కుమాలిన రాజకీయాలు మాని, ప్రజలకు మంచి చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. బిఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు కొనసాగితే తాము కూడా తిరగబడక తప్పదన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం, నూతనకల్ మండలపరిధిలోని లింగంపల్లి గ్రామంలో హత్యకు గురైన బిఆర్ఎస్ కార్యకర్త ఉప్పలమల్లయ్య కుటుంబాన్ని కెటిఆర్ ఆదివారం పరామర్శించారు. మల్లయ్య చిత్రపటానికి పూలమాలలేసి నివాళలర్పించారు. బాధితకుటుంబానికి రూ.ఐదు లక్షల ఆర్థికసాయాన్ని కెటిఆర్ అందజేశారు. మల్లయ్యపై హత్య జరిగిన వెంటనే రావాలనుకున్నా, ఉద్రిక్తతలు పెరగకూడదనే ఉద్దేశంతోనే కొద్దిరోజులు ఆగానని తెలిపారు. బాధిత కుటుంబానికి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని, తప్పకుండా మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని, రాగానే ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. కేవలం సర్పంచ్, పంచాయతీ ఎన్నికలకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతగా భయపడుతోందని ఎద్దేవా చేశారు. రెండేళ్లలో అద్భుతాలు చేశామని, రుణమాఫీ, ఇండ్లు, రేషన్‌కార్డులు ఇచ్చామని కాంగ్రెస్ చెబుతున్న మాటలు నిజమే అయితే, ఎన్నికలంటే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు.

బిఆర్ఎస్ శ్రేణులకు అభినందనలు

ఈ మండలంలో కాంగ్రెస్‌కు దీటుగా, సమానంగా బిఆర్ఎస్ పంచాయతీ ఎన్నికల్లో సుమారు 50 శాతం సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలను కైవసం చేసుకున్న గులాబీ సైనికులకు ఆయన అభినందనలు తెలియజేశారు. ప్రజలంతా కేసీఆర్ పాలన కోసం, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు మల్లయ్యయాదవ్, బూడిద భిక్షమయ్య, నేతలు భూపాల్‌రెడ్డి, చింతలవెంకటేశ్వర్‌రెడ్డి, నరసింహారెడ్డి, గుజ్జ యుగంధర్‌రావు, దయాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలఅధ్యక్షులు మొన్న మల్లయ్యయాదవ్, ప్రధానకార్యదర్శి భక్తుల సాయిలుగౌడ్ ,నాయకులు గాజుల తిరుమలరావు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అవంచలో ఇరుగ్రూపుల ఘర్షణ

- ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇరువర్గాల ఘర్షణ ఇద్దరికీ గాయాలైన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని అవంచలో చోటుచేసుకుంది. గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున బిఆర్ఎస్ లోని రెండు గ్రూపుల మధ్య ఈ ఘర్షణ జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. బిఆర్ఎస్ లోని రెండు గ్రూపుల్లో ఒక గ్రూపు తెల్లవారుజామున డబ్బులు పంచుతున్నారన్న సమాచారంతో రెబల్ అభ్యర్థి తరపున కార్యకర్తలు నాయకులు గొడవకు దిగారు. మాట మాట పెరగడంతో గొడవకు దారితీసింది. మాజీ సర్పంచ్ ఉషాన్న, అభ్యర్థి అభ్యర్థి కుమారుడు తరుణ్ కు గాయాలయ్యాయి ఈ సంఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



చలో ఢిల్లీ బయలుదేరుతున్న జెఎసి నాయకులు

- కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరవాలి
- బిసి జెఎసి నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించాలని బిసి జెఎసి డిమాండ్ చేసింది. రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేయాలని కోరింది. ఈ నెల 15, 16 తేదీల్లో తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో నాయకులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కండ్లు తెరవాలని కోరారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో కేంద్ర ప్రభుత్వంలో పెద్దలతో పాటు పార్లమెంటులో ప్రతిపక్ష నాయకులను కలిసి బిసి బిల్లు ఆమోదం కోసం కృషి చేస్తామని వారు తెలిపారు.

కంటోన్మెంట్లపై కేంద్రం శీతకన్ను

- రూ.10 వేల కోట్ల సర్వీస్ ఛార్జీలు చెల్లించకుండా నిర్లక్ష్యం
- ఆర్థికంగా చితికిపోతున్న బోర్డులు
- సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కే రూ.1,145.17 కోట్ల బకాయి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వికసిత్ భారత్ అంటున్న కేంద్ర ప్రభుత్వం...వికసిత్ కంటోన్మెంట్లను ఎందుకు పట్టించుకోవడం లేదు. దేశభక్తి గురించి ప్రగల్భాలు పలుకుతున్న బిజెపి సర్కారు... దేశభక్తికి ఆలవాలమైన ఆర్మీ కంటోన్మెంట్లపై శీతకన్ను వేసింది. వేశారు. దేశ వ్యాప్తంగా 62 కంటోన్మెంట్లు ఉన్నాయి. వాటికి దాదాపు రూ.పది వేల కోట్లు బకాయిలను పెట్టింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు అత్యధికంగా రూ. 1145 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో దేశ వ్యాప్తంగా కంటోన్మెంట్ బోర్డుల్లో జరగాల్సిన అభివృద్ధి, వాటిని నిర్వహణ కుంటుపడుతోంది. బోర్డులు ఆర్థికంగా చితికిపోతున్నాయి. రోజువారీ నిర్వహణకే నిధుల్లేక ఇబ్బంది పడుతున్నాయి. సిబ్బంది జీతభత్యాలకే పరిమితమైన స్థానిక నిధులతో ఏ విధమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే పరిస్థితి లేకుండా పోయింది. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కంటోన్మెంట్లలో పౌరసేవలు అందిస్తున్నాయి. అందుకుగానూ కేంద్ర ప్రభుత్వం వాటికి సర్వీస్ ఛార్జీల పేరిట ప్రతియేటా నిధులను విడుదల చేయాల్సి ఉంటుంది. కానీ కొన్నేళ్లుగా వాటికి నిధులను విడుదల చేయడంలో మోడీ సర్కారు నిర్లక్ష్యం చేస్తున్నది. దీని కారణంగా కంటోన్మెంట్లలో జరగాల్సిన అభివృద్ధి జరగడం లేదు. సర్వీస్ చార్జీలు రాకపోవండంతో కంటోన్మెంట్ సేవలే గాడి తప్పుతున్నాయి. దేశంలోని కంటోన్మెంట్ ప్రాంతాలు కేంద్రం చెల్లించాల్సిన సర్వీస్ చార్జీలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నాయి. స్థానిక ప్రజలకు డ్రైనేజ్, వీధి లైటింగ్, శానిటేషన్, నీటి సరఫరా, గార్బేజ్ కలెక్షన్ వంటి సేవలు అందించడం కంటోన్మెంట్ బోర్డుల బాధ్యత. అయితే ఈ సేవలకు బదులుగా కేంద్ర రక్షణ శాఖ నుంచి రావాల్సిన నిధులు కొన్నేండ్లుగా ఆలస్యమవుతుండడంతో బోర్డులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

యాజమాన్యం మొండితనం.. కార్మికుల అచేతనం

- పనికి తగ్గ జీతం ఇవ్వని యాజమాన్యాలు
- పెరుగుతున్న ధరల భారంతో ఇబ్బందులు
- కొనసాగుతున్న 'షాహి' పరిశ్రమ మహిళా కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కమిటీలు, నివేదికలు, వేతనాలు సవరించాలని పదేపదే సూచించినా సర్కారుకు తలకెక్కటం లేదు. గత బీఆర్ఎస్ పాలకులు, నేటి కాంగ్రెస్ పాలకులూ యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గి వేతనాలు పెంచకుండా జాప్యం చేస్తున్న పరిస్థితి కొట్టొచ్చినట్టు కనపడుతోంది. యాజమాన్యాలు, పాలకులు ఆడుతున్న ఆటలో కార్మికులే సమిధులవుతున్నారు. యజమానులు లాభాల మీద లాభాలు పోగేసుకుంటూ కరోడ్‌పతులవుతున్నారు.

షాహి ఎక్స్‌పోర్ట్ ప్రయివేట్ లిమిటెడ్ పరిశ్రమలో పని చేస్తున్న మహిళా కార్మికుల పట్ల యాజమాన్యం, కార్మిక శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. జీతాలు సరిపోక తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కార్మికులున్నారు. 15 ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులకు గొర్రెతోక బెత్తెడు వేతనాలతో కుటుంబం గడవక అప్పులపాలయి.. అవస్థలు పడుతున్నారు. జీతాలు పెంచండి సారో..అని యాజమానికి ఎన్ని విన్నపాలు చేసినా..పెడచెవిన పెట్టారు. అందమైన బ్రాండెడ్ దుస్తుల తయారీ వెనుకున్న శ్రమను పట్టించుకోని యాజమాన్యం అలివి మాలిన నిర్లక్ష్యంపై నిరసన గళమెత్తారు.. మరో పక్క పోరాడి సాధించుకున్న కనీస వేతనాల జీవోలను అధికారులు కాగితాల్లోనే మగ్గపెడుతున్నారు. పెరిగిన ధరలు, కార్మికుల జీవన ప్రమాణాలను పరిగణలోకి తీసుకుని ఐదేళ్లకోసారి సవరించాల్సిన జిఓను రివైజ్ చేయకుండా సంకెళ్లు వేసి పాలకులు పైసాచిక ఆనందాన్ని పొందుతున్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో మొన్నటి బిఆర్ఎస్, నేటి కాంగ్రెస్..కార్మికుల శ్రమను పిండుకుని, యాజమాన్యాలు లాభాలు దండుకునేందుకు ఉపయోగపడే విధానాలను అనుసరించాయని కార్మిక సంఘాలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నాయి.'కార్మికుల శ్రేయస్సే తమ లక్ష్యం' అని ప్రభుత్వాలు చెప్పే మాట ఉత్తుత్తిదేనని షాహి పరశ్రమ కార్మికుల ఆకలి కేకలు..వారం రోజులుగా చలి, ఎండను లెక్క చేయకుండా నిర్వహిస్తున్న పోరాటం ప్రత్యక్ష సాక్ష్యం.

జిఓ సాకుతో..

కనీస వేతనాల జిఓను 15 ఏళ్లుగా ప్రభుత్వం సవరించలేదు. ఆ సాకుతో జీతాలు పెంచకుండా యాజమాన్యాలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో తీసుకొచ్చిన జీవోనే ప్రామాణికంగా తీసుకుని వేతనాలు చెల్లిస్తున్నామని యాజమాన్యాలు చెబుతున్నాయంటే కార్మికులు అందుకుంటున్న జీతం ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. ఈ కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు ఎన్నో రెట్లు పెరిగాయి. పిల్లల విద్య, వైద్యం, ఇత్యాది అవసరాలు అదే మోతాదులో పెరిగాయి. కానీ..జీతాలు మాత్రం యధాతథంగా ఉన్నాయి. దీంతో కుటుంబాన్ని సాకటం కష్టంగా మారింది. దీంతో ప్రయివేటుగా అప్పులు చేసి కుటుంబ అవసరాలు తీర్చుకుంటుబాన్ని కార్మికులు వాపోస్తున్నారు. ఒక షాహి పరిశ్రమలోని కార్మికుల పరిస్థితే కాదు..రాష్ట్రంలోని కోటి 20లక్షల మంది 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ పరిశ్రమల్లోని కార్మికుల దీనావస్థ ఇది. వీరికి కనీస వేతన చట్టం 1948 ప్రకారం ప్రతి ఐదేండ్లకోసారి వేతనాలు పెంచాలి. 2006-2012 మధ్య ఉమ్మడి రాష్ట్రంలో సవరించారు తప్పితే..15ఏండ్లుగా కార్మికుల వేతనాలు పెంచకపోవటం వల్ల యాజమాన్యాలకు ప్రభుత్వమే రూ. వేల కోట్లు మిగిలే విధంగా దోహదపడిందని కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి. పెరిగిన ధరల నేపథ్యంలో కనీస వేతనం రూ. 26వేలు నిర్ణయించకుండా కార్మికులను అర్థాకలితో బతికే విధంగా చేస్తోందని ఆరోపణలున్నాయి.

నిరసన గళం..

తమ జీతాలు పెంచాలంటూ నాచారం పారిశ్రామిక వాడలోని షాహి ఎక్స్‌పోర్ట్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ ఎదుట వారం రోజులుగా వందలాది మంది మహిళా కార్మికులు చలికి వణుకుతూ ధర్నా నిర్వహిస్తున్నారు. పదేండ్లుగా కంపెనీలో పనిచేస్తున్నా జీతాలు పెంచకపోవటంతోనే వారు ఆందోళనకు దిగారు. నెలలో రెండు సెలవులు ఉంటాయనీ, వాటిని ఉపయోగించుకుంటే జీతాలు కట్ చేస్తున్నారని చెబుతున్నారు.

ఎక్కువ పని గంటలు పనిచేయించుకుంటున్నారనీ, గంటకు టార్గెట్ ఇచ్చి ఒత్తిడికి గురి చేస్తున్నారని తెలుస్తోంది. నిమిషం ఆలస్యంగా వచ్చినా..గేటు బయట నిలబెట్టి సగం రోజు జీతం కట్ చేస్తున్నారని చెప్పారు. పని స్థలాల్లో వేధింపులు పెరిగాయని కార్మికులు చెబుతున్నారు. కనీస సౌకర్యాలు లేవని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అచేతనంగా కార్మిక శాఖ..

షాహి కంపెనీ కార్మికులకు న్యాయం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. దీంతో జెసిఎల్ రవీందర్‌రెడ్డి యాజమాన్యంతో చర్చలు జరిపారు. యాజమాన్యం మొండి వైఖరితో చర్చలు సఫలం కాలేదు. కార్మిక శాఖ అధికారులు అచేతనంగా తిరుగుముఖం పట్టారు. కార్మిక శాఖ అధికారులే ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే..కార్మికులకు దిక్కెవరని వారు ప్రశ్నిస్తున్నారు.

మంత్రి జోక్యం చేసుకోవాలి..

కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి జోక్యం చేసుకుని వేతనాలు పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.



రెండో విడతలోనూ కాంగ్రెస్ మద్దతుదార్ల హవా

- 1500కు పైగా కాంగ్రెస్, 800కు పైగా బిఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్‌లు విజయం

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

తెలంగాణలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థుల హవా కొనసాగింది. తొలి విడతలో అత్యధిక స్థానాలు కైవసం చేసుకుని జోష్ మీదున్న ఆపార్టీ.. రెండో విడతలోనూ విజయపరంపర కొనసాగిస్తోంది. 193 మండలాల్లోని 3,911 గ్రామ పంచాయతీ సర్పంచులు, 29,917 వార్డు సభ్యుల పదవులకు ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు పోలింగ్ ముగిసింది. 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమయింది. రాత్రి 8 గంటల వరకు వెలువడిన ఫలితాలను బట్టి.. కాంగ్రెస్ బలపర్చిన సర్పంచి అభ్యర్థులు 1500కు పైగా, బిఆర్ఎస్ మద్దతుతో 800కు పైగా, బిజెపి భాజపా 190, ఇతరులు 440కు పైగా స్థానాల్లో విజయం సాధించారు.

లాటరీలో వరించిన విజయం..

మెదక్ మండలం చీపురుదుబ్బతండా గ్రామ సర్పంచి ఎన్నిక ఫలితం డ్రాలో తేలింది. చీపురుదుబ్బతండా పంచాయతీకి మోటు కాడి తండా, నైలి తండా అనుబంధంగా ఉన్నాయి. మొత్తం 3 తండాల్లో కలిపి 377 ఓట్లు ఉండగా.. 367 ఓట్లు పోలయ్యాయి. అందులో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేసిన కేతావత్ సునీతకు 182, భారత రాష్ట్ర సమితి మద్దతుతో పోటీ చేసిన బీమిలికి 182 ఓట్లు లభించాయి. ఇద్దరికీ సమానంగా ఓట్లు రావడంతో రిటర్నింగ్ అధికారి వెంకటయ్య డ్రా తీశారు. లాటరీలో కాంగ్రెస్ అభ్యర్థి సునీతను అద ష్టం వరించింది. దీంతో ఆమె సర్పంచిగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మాసానిగూడ పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. 8వ వార్డు సభ్యురాలిగా పోటీ చేసిన పల్లె లత(42) ఈనెల 7వ తేదీన గుండెపోటుతో మ తి చెందారు. ఆదివారం జరిగిన పోలింగ్‌లో ప్రత్యర్థి పల్లె అనితపై లత 30 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 7వ తేదీ సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మ తిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. 8వ వార్డుకు తిరిగి నోటిఫికేషన్ నిర్వహించి ఎన్నిక నిర్వహిస్తామని ఎంపీడీఓ వెంకయ్య తెలిపారు.



అశ్రునయనాలతో జమున అంత్యక్రియలు

- పేదల కాలనీల ఏర్పాటులో కీలకపాత్ర
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుండెపోటుతో హఠాన్మరణం చెందిన ఆదిలాబాద్ జిల్లా ఐద్వా ప్రధాన కార్యదర్శి లంక జమున అంత్యక్రియలు ఆదివారం జరిగాయి. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు బండారు రవికుమార్, ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆశాలత జమున మృతదేహంపై పూలమాలలు వేసి నివాళి అర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండారు రవికుమార్ మాట్లాడుతూ ఎర్రజెండా రాజ్యం స్థాపించడమే లంక జమునకు ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. పేదలకు ఇంటిస్థలాల కోసం భూపోరాటాలు నిర్వహించి పోలీసులు కేసులను సైతం ఎదుర్కొని రణదీవెనగర్, భగత్‌సింగ్‌నగర్, కుంరం భీం లాంటి కాలనీలు ఏర్పాటులో కీలక భూమిక పోషించారని తెలిపారు. నేటితరం నాయకులు ఆమెను చూసి ప్రేరణ పొందాలని పిలుపునిచ్చారు. ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆశాలత మాట్లాడుతూ ఆపదలో ఉన్న ఆడబిడ్డలు తన దగ్గరికి వస్తే అమ్మలా ఆదరించి వారికి మనోధైర్యాన్ని కల్పించి అండగా నిలిచేదని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ సిపిఎం కార్యకర్తలు, ప్రజాసంఘాల కార్యకర్తలు అమ్మను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతిమయాత్రలో జమున కుమారుడు లంక కార్తీక్, కుమార్తె రాణి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూసం సచిన్, సీనియర్ నాయకులు లంక రాఘవులు, బండి దత్తాత్రి, నిర్మల్ జిల్లా కార్యదర్శి గౌతం కృష్ణ పాల్గొన్నారు.

ఘర్షణలు... ఉద్రిక్తతలు.. విషాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా పలు చోట్ల ఘర్షణలు చోటు చేసుకున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలు ఉద్రిక్తతలకు దారి తీశాయి. అదేవిధంగా ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం అనాసాగర్‌లో విషాదం చోటుచేసుకున్నది. ఎన్నికల బరిలో ఉన్న సర్పంచ్ అభ్యర్థి మరణించారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న దామాల నాగరాజు శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒత్తిడికి గురైన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులో ఆయనను దవాఖానకు తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో ఆదివారం తెల్లవారుజామున మరణించారు. నిజామాబాద్ జిల్లా దర్పల్లి మండలం దమ్మన్నపేటలో ఓటు వేసిన అనంతరం ఒక వ్యక్తి మృతిచెందారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మాసానిగూడలో 8వ వార్డులో పోటీ చేసిన పల్లె లత ఈ నెల ఏడున మృతిచెందారు. అయితే ఆమెను ఆదివారం జరిగిన ఎన్నికల్లో విజయం వరించింది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ముల్కల కాలువ గ్రామంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇక్కడ కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థి కొండా శ్వేత విజయం సాధించారు. ఫలితాల అనంతరం కాంగ్రెస్, రెబల్ అభ్యర్థి సైదాచారి గ్రూపుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇరు గ్రూపులకు చెందిన వారు రాళ్లు విసురుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. వారిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. హనుమకొండ జిల్లా పరకాల మండలం నాగారం పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇక్కడ తొమ్మిది వార్డుల్లో వరుసగా బిఆర్ఎస్ మద్దతుదారులు గెలవడంతో కాంగ్రెస్ మద్దతుదారులు ఆందోళన వ్యక్తం చేశారు.

సొమ్మసిల్లి పడిపోయిన సర్పంచ్ అభ్యర్థి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ంండో విడత సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా ఆదివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం పరిధిలోని అర్జున్ నాయక్ తండా కాంగ్రెస్ అభ్యర్థి సవితాబాయి ఓట్ల లెక్కింపు సమయంలో కౌంటింగ్ హాల్లోనే సొమ్మసిల్లి పడిపోయారు. ఉపవాసం, ఎన్నికల ఒత్తిడిని తట్టుకోలేక పడిపోయి ఉంటుందని భావించారు. వెంటనే ఆమెను అంబులెన్స్‌లో జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు కొనసాగుతున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

డ్రాలో వరించిన సర్పంచ్ పదవి

గెలుపునకు ఒక్కోసారి అదృష్టం కూడా ఉండాలని అంటారు. అలా ఓ అభ్యర్థి సర్పంచి పదవికి ఎంపికైంది. మెదక్ మండలం చీపురుదుబ్బ తండా సర్పంచ్‌గా కేతావత్ సునీత డ్రాలో విజయం సాధించారు. గ్రామంలో మొత్తం 377 ఓట్లు ఉండగా.. కాంగ్రెస్ బలపరిచిన సునితకు, బిఆర్ఎస్ బలపరిచిన భీమిలికి 182 ఓట్లు చొప్పున సమానంగా వచ్చాయి. రెండు ఓట్లు చెల్లనివి పోల్ అవగా.. ఒక ఓటు నోటాకు పడింది. ఇద్దరికీ సమానంగా ఓట్లు రావడంతో రిటర్నింగ్ అధికారి డ్రా తీశారు. డ్రాలో కాంగ్రెస్ బలపరిచిన మహిళా అభ్యర్థి పేరు రావడంతో సునీతను సర్పంచ్ పదవి వరించింది.

నడవ లేకపోయినా యువతకు ఆదర్శం ఈ మహిళ

ఈ ఎన్నికల్లో ఓ మహిళ ఎంతో మంది యువతకు స్ఫూర్తి నింపారు. సాధారణంగా యూత్ ఎన్నికల్లో ఓటు వేయడానికి పెద్దగా ఆసక్తి చూపరు. అయితే మెదక్ జిల్లాలోని రామాయంపేట మండల పరిధిలోని కల్వకుంట పోలింగ్ కేంద్రంలో నడవలేని స్థితిలో ఉన్న మహిళ ఓటు వేసింది. ఆమె నడవలేకపోయినా తండ్రి భుజాలపై మోసుకుంటూ పోలింగ్ కేంద్రానికి తీసుకురాగా.. తన ఓటును వినియోగం చేసుకుంది. ఈ ఒక్క ఎన్నికల్లోనే కాదని, ప్రతి ఎన్నికల్లో ఓటు వేసి రాజ్యాంగం తనకు కల్పించిన ఓటు హక్కును వినియోగించుకుంటానని ఈ సందర్భంగా ఆమె తెలిపింది.

ఓటు వేసిన 110 ఏళ్ల వృద్ధురాలు

ఓటుకు ఎంత విలువైందో అర్థం చెప్పేలా 110 ఏళ్ల ఓ వృద్ధురాలు ఓటు వేసి అందరికీ ఆదర్శంగా నిలిచింది. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామపంచాయతీ ఎన్నికల్లో రాజ్యమ్మ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృద్ధాప్యాన్ని లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటేయడం ద్వారా ప్రజాస్వామ్యంపై ఉన్న తన బాధ్యతను ఆమె చాటుకోవడం చాలా గొప్ప విషయం.

సర్పంచ్ అభ్యర్థి భర్త అదృశ్యం.. ఇంటికి చేర్చిన పోలీసులు

సర్పంచ్ ఎన్నికల్లో చిత్ర విచిత్రమైన ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఓట్ల కోసం అభ్యర్థులు నానా తంటాలు పడుతున్నారు. ఈ క్రమంలో మెదక్ జిల్లా చేగుంట మండలం గొల్లపల్లిలో జరిగిన ఘటన స్థానికంగా హై డ్రామాకు దారితీసింది. సర్పంచ్ అభ్యర్థికి బరిలో ఉన్న చెర్యాల సబిత భర్త జనార్దన్ రెడ్డి అదృశ్యం కావడం గ్రామంలో తీవ్ర కలకలం రేపింది.

తెల్లారితే ఎన్నికలు జరుగుతాయనగా శనివారం రాత్రి అభ్యర్థి భర్త కనిపించకపోవడంతో ఆయన ఏమైపోయారని టెన్షన్ సర్వత్రా నెలకొంది. ఈ ఘటనపై ఫిర్యాదు రావడంతో పోలీసులు జనార్దన్ రెడ్డి ఆచూకీ కనిపెట్టేందుకు రంగంలోకి దిగారు. డ్రోన్ల సహాయంతో గ్రామ పరిసర ప్రాంతాల్లో గాలించారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం గ్రామంలో వరి పొలాల్లో జనార్దన్ రెడ్డి ఆచూకిని పోలీసులు కనిపెట్టి వారి ఇంటికి తీసుకొచ్చారు. అయితే సానుభూతి కోసమే అదృశ్యం డ్రామా ఆడి ఉంటారని పలువురు చర్చించుకున్నారు.

పోటీ చేయగానే అయిపోలె...

- సర్పంచు, వార్డు సభ్యులు ఖర్చు వివరాలను పక్కాగా చూపాల్సిందే
- గెలిచినా, ఓడినా అభ్యర్థులపై చర్యలుంటాయంటున్న అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల్లో పెట్టిన ఖర్చు ఏదైనా లెక్క చూపాల్సిందే తేడా వస్తే... గెలిచినా ఓడినా పోటీ చేసిన అభ్యర్థులకు తిప్పలు తప్పవు. తప్పుడు లెక్కలు చేప్పితే పూర్తి బాధ్యత వహించాల్సిందేనని అధికారులు అంటున్నారు. ప్రతి ఖర్చు ఆధారాలతో సహ అందజేయాల్సిందే అని అధికారులు చెబుతున్నారు. సర్పంచు, వార్డు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఖర్చు వివరాలను పూర్తిగా, పక్కాగా నమోదు చేయాల్సిందే. ఆ వివరాలను ఎన్నికల అనంతరం 45 రోజుల్లోగా ఎంపిడిఒలకు అందించాల్సి ఉంటుంది. ఖర్చుల వివరాలను సమర్పించకపోతే, సదరు అభ్యర్థి గెలిచినా, ఓడినా రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటారు. గెలిచిన అభ్యర్థులపై అనర్హత, ఇతర చర్యలు తీసు కునేందుకు ఎంపిడిఒల సిపార్సు మేరకు డీపీవో కలెక్టర్‌కు నివేదిక పంపుతారు. వారి నుంచి వచ్చిన వివరణ మేరకు కలెక్టర్ చర్యలు తీసుకుంటారు. అలాగే ఓడిపోయిన సర్పంచు, వార్డు మెంబర్లు ఏ ఇతర ఎన్నిక ల్లోనూ పోటీ చేయకుండా వారిపై అనర్హత వేటు వేయనున్నారు. దీంతో అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. అంతర్గత ఖర్చులు తప్ప బహిరంగంగా కనపడే ఖర్చులు లేకుండా అభ్యర్థులు జాగ్రత్త పడుతున్నారు.

జనాభాను బట్టి ఎన్నికల ఖర్చు

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచు, వార్డు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఎంత ఖర్చు చేయవచ్చో ఎన్నికల వ్యయ పరిశీలకులు నిర్ణయించిన విషయం తెలిసిందే. జనాభా ఐదు వేల కంటే ఎక్కువగా ఉన్న గ్రామ పంచాయతీ లలో సర్పంచు అభ్యర్థి రూ 2.50 లక్షల వరకు ఖర్చు చూపాలి. వార్డు సభ్యుడి స్థానానికి రూ. 50 వేలు మాత్రమే ఖర్చు చూపాలి. చేయకుంటే ఏమీ లేదు. చిన్న గ్రామ పంచాయతీల్లో సర్పంచు అభ్యర్థికి రూ. 1.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ. 30 వేలను ఎన్నికల అధికారులు నిర్ణయించారు.

2019లో 500 మందిపై అనర్హత

నారాయణపేట, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు, 2019లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అనంతరం 2019, ఫిబ్రవరి 17లో అప్పటి సిఎం కెసిఆర్ తన జన్మదినం సంబర్భంగా నారాయణపేట జిల్లాను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు మొత్తం 721 గ్రామాలకు గాను బండమీదిపల్లి, శంకరాయిపల్లి గ్రామాలకు ఎన్నికలు నిర్వహించలేదు. 719 గ్రామాలకు, 6,825 వార్డు సభ్యులకు ఎన్నికలు జరిగాయి. అందులో 500 మంది వార్డు సభ్యులు, 25 మంది సర్పంచులు ఎన్నికల ఖర్చు వివరాలను సమర్పించలేదు. దీంతో వారు మూడేళ్ల పాటు ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా అనర్హత వేటు వేశారు. ఈ సారి ఎన్నికల్లో ఎంత మంది అభ్యర్థులు ఎన్నికల ఖర్చు వివరాలను అందిస్తారో ఎన్నికల అనంతరం తెలుస్తుంది.

అంతు చిక్కని ఖర్చు

గ్రామాలల్లో సర్పంచు అభ్యర్థులుగా పోటీ చేస్తున్నవారి ఖర్చు చూస్తే కళ్లు తిరిగిపోతాయి. ముఖ్యంగా నోటిఫికేషన్ పడిన నాటి నుంచి ఎలక్షన్ దాకా వారు పెట్టిన ఖర్చు 20 లక్షల నుంచి కోటి వరకూ ఉంటుందని చర్చ జరుగుతుంది.

సామాన్యులు ఎన్నికల్లో గెలవలేరు : వెంకటయ్య, గుంతకోడూరు

నేను 15 ఏళ్లుగా ఈ గ్రామంలో వామపక్ష ఉద్యమ నిర్మాణం కోసం కృషి చేశాను. ఎవరికి ఏ ఆపద వచ్చినా దగ్గర ఉండి ఆదుకున్నాను. ఎన్నికలు ఏవైనా సామాన్యులు గెలిచే పరిస్థితులు లేకుండా పోయాయి. ప్రజలు సామాన్య కార్యకర్తలను గెలిపించి అవినీతికి దూరంగా ఉండేలా ప్రజలే నాయకుల విధానాలను మార్చేలా ఉండాలి.